క్లుప్తంగా

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి



ఆకుకూరల ప్రాముఖ్యతను వివరిస్తున్న సీడీపీఓ

మార్కాపురం టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సీడీపీఓ సుశీలాదేవి పేర్కొన్నారు. మార్కాపురం పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార వారోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పౌష్టికాహారంతో ఉపయోగాలు, తయారీ విధానాన్ని గర్భిణులు, తల్లులకు వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, కార్యకర్తలు జబీనా, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఆఫీసా.. పార్కింగ్ ప్లేసా?



మార్కాపురం రెవెన్యూ కార్యాలయం ఆవరణలో పార్కింగ్ చేసి ఉన్న కార్లు

మార్కాపురం రూరల్: మార్కాపురం తహసీల్దార్ కార్యాలయం వాహనాల పార్కింగ్ ప్లేస్‌లా మారింది. వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు తమ వాహనాలకు పార్కింగ్ ప్లేసుగా మార్కాపురం తహసీల్దార్ కార్యాలయాన్ని ఎంచుకున్నారు. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ట్రెజరీ ఆఫీసు, సబ్‌జైలు, ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్, ఎంప్లాయిమెంట్ కార్యాలయం ఉన్నాయి. దీంతో కార్యాలయానికి వచ్చే అర్జీదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇక ఎంపీడీఓ కార్యాలయం టూ వీలర్స్‌కు పార్కింగ్ ప్లేసుగా మారింది. ఒంగోలు, విజయవాడ వెళ్లేవారు ఉదయాన్నే తమ టూవీలర్‌ను ఎంపీడీఓ కార్యాలయాల్లో పార్కింగ్ చేసి వెళ్తున్నారు. అధికారులు వీటిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ-క్రాప్‌తో రైతులకు మేలు



వద్దిమడుగులో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు రైతు సేవా కేంద్రం పరిధిలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియను మంగళవారం రైతులు, వ్యవసాయ సహాయకులతో కలిసి ఏఓ ప్రసన్న రంగలక్ష్మి పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. పంట నష్ట పరిహారం, సబ్సిడీలు పొందేందుకు ఈ క్రాప్ వివరాలే ప్రామాణికమని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీలోగా రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

కేజీబీవీలో పోషకాహార సదస్సు

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు కేజీబీవీలో మంగళవారం ఐసీడీఎస్ సీడీపీఓ సుశీలాదేవి ఆధ్వర్యంలో పౌష్టికాహార సదస్సు నిర్వహించారు. ఆకుకూరలు, తృణ ధాన్యాలు తీసుకోవాలని విద్యార్థినులకు సూచించారు. బాల్య వివాహాలతో అనర్థాలపై ప్రిన్సిపాల్ మారుతీదేవి అవగాహన కల్పించారు. తర్లుపాడు పీహెచ్‌సీ సిబ్బంది వైద్య పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణితో పాటు కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో పీహెచ్‌సీ డాక్టర్ల నిరసన



బేస్తవారిపేట పీహెచ్‌సీలో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరైన డాక్టర్లు

బేస్తవారిపేట: మండలంలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు జీఓ 85కి వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కొత్త జీఓ ప్రకారం మూడేళ్ల సర్వీసు అర్థం లేకుండా పోతుందని, ఆకస్మాత్తుగా జీఓను మార్చడం అన్యాయమని, తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం జరుగుతుందని డాక్టర్లు పేర్కొన్నారు. అన్యాయమైన ఈ జీఓను రద్దు చేయాలని ఉన్నత స్థాయి అధికారులు, ఎమ్మెల్యేలకు అర్జీలు ఇచ్చినప్పటికి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆందోళన బాట పట్టినట్లు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన గిద్దలూరు కమిషనర్



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: కలెక్టర్ తమీమ్ అన్సారియాను ఒంగోలు ప్రకాశం భవనంలోని ఆమె చాంబర్‌లో గిద్దలూరు నగర పంచాయతీ నూతన కమిషనర్ డి.వెంకటదాస్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగర పంచాయతీలో ప్రజా సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించినట్లు కమిషనర్ తెలిపారు.

వ్యాధుల కాలం..

అప్రమత్తతే ప్రధానం!

పుల్లలచెరువు: వర్షాకాలం వ్యాధుల బారిన పడే అవకాశాలు మెండుగా ఉంటాయి. దీనికి తోడు గ్రామాల్లో అడుగడుగునా తిష్ట వేసుకున్న పారిశుధ్య సమస్యలు ప్రజలను మరింత భయాందోళనలకు గురిచేస్తున్నాయి. పారిశుధ్యాన్ని మెరుగు పరచడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు నానా ఇబ్బందులు ఏదుర్కొంటున్నారు. పలు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో ఏటా సీజనల్ వ్యాధులతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారిన పడకుండా రక్షణ పొందవచ్చని వైద్యులు అంటున్నారు.

మురుగు నిల్వలే మూలం

ఖాళీ స్థలాలు, ఇళ్ల మధ్య మురుగు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. అటువంటి ప్రదేశాల్లో దోమల మందు పిచికారీ చేయడంలో, నీటి నిల్వలను తొలగించడం వంటి చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉన్నచోటే పందులు కూడా సంచారం చేస్తుంటాయి. వీటితో పాటు ఇంటి పరిసరాల్లో వాడని రోళ్లు, డ్రమ్ములు, పాత వస్తువులు, టైర్లు, డబ్బాలు, కొబ్బరి బొండాల్లో వర్షం నీరు చేరి దోమలు ఆవాసాలుగా మారుతున్నాయి.

దోమలతో అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలంలో ప్రబలే వ్యాధులకు దోమలు, అపరిశుభ్రతే ప్రధాన కారణాలు, దోమల కారణంగా మలేరియా, ఫైలేరియా, డెంగీ, మెదడువాపు తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా అపరిశుభ్రతతో డయేరియా, టైఫాయిడ్, కామెర్లు తదితర వ్యాధులు సోకుతాయి. డెంగీ, మలేరియా వ్యాప్తికి కారణమయ్యే దోమలు మురుగు నీటితోనే వృద్ధి చెందుతాయి. ఆవాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు పాటిస్తే దోమల వృద్ధిని అరికట్టవచ్చు. డయేరియా, టైఫాయిడ్, కామెర్లు వ్యాధులు అపరిశుభ్రత వాతావరణం, కలుషిత ఆహారం, తాగునీరు మూలంగానే వస్తాయి.

చిన్నారులపై శ్రద్ధ చూపాలి

వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున చిన్నారుల తల్లిదండ్రులు అప్రత్తంగా ఉండాలి. వారి ఆరోగ్యం ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పిల్లలు జలుబు, దగ్గు బారిన పడే అవకాశం ఉంది. ఇలాంటి సమయాల్లోనే తల్లిదండ్రులు ఆస్పత్రిలో చూపించి, వైద్యుల సూచనలు పాటిస్తే వ్యాధుల బారి నుంచి తప్పించుకోవచ్చు.

ఇలా చేస్తే ఎంతో ప్రయోజనం

పరిసరాల్లో నిల్వ ఉన్న మురుగు నీటిలో కిరోసిన్ లేదా, ఫినాయిల్ వేయాలి. దీంతో దోమల లార్వాలకు గాలి, వెలుతురు అందక అవి చనిపోతాయి. దోమల తెరలు తప్పక వాడాలి. నీరు నిల్వ ఉండే పాత్రలు, తొట్టెలను వారంలో ఒక రోజు తప్పనిసరిగా శుభ్రపరచి ఎండపెట్టాలి. ఇంటి పరిసర ప్రాంతాల్లో వేప, గానుగ, తులసి ఆకులతో సాయంత్రం పూట పొగ పెట్టాలి. ఇలా ఐదు రోజులు చేస్తే ఇంటి పరసరాల్లోకి దోమలు రాకుండా ఉంటాయి. ఉసిరి, నిమ్మజాతి మొక్కలు పెంచినా దోమలు దరిచేరవు.



మర్రివేములలో ఇళ్ల మధ్యే మురుగు

మలేరియా తదితర వ్యాధులకు కారణమైన దోమలు మంచినీటిలో గుడ్లు పెడతాయి. వాడి పాడేసిన డబ్బాలు, వస్తువులు, సామగ్రిలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి:



ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రజలు ఆరోగ్య విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. గ్రామాల్లో మా సిబ్బంది ప్రజలలకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు ఫీవర్ సర్వే కూడా నిర్వహిస్తున్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలని సూచిస్తున్నాం.

– డాక్టర్ లక్ష్మీనరసింహ, ప్రభుత్వ వైద్యుడు, పుల్లలచెరువు

పత్తి పంట



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గులాబీ రంగు పురుగు రాకుండా చూడాలి

దొనకొండ: పది రోజుల నుంచి కురిసిన వర్షాలకు గ్రామాల్లోని రైతులు సాగు చేసిన పత్తి పంట శ్రేష్టకరంగా ఉందని, పూత, మొగ్గ, చిన్న చిన్న కాయలు ఏర్పడుతున్నాయని, ఈ దశలో గులాబీ రంగు పురుగు సోకి నష్ట పరిచే అవకాశం ఉందని, అది రాకుండా రైతులు ముందు జాగ్రత్త పడాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రమేష్, వరప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని ఆరవల్లిపాడు, వద్దిపాడు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి పొలాలను వారు మంగళవారం పరిశీలించారు. గులాబీ రంగు పురుగు ఉధృతిని తెలుసుకునేందుకు ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని, మూడు రోజులు వరుసగా 8 తల్లి రెక్కల పురుగులు పడితే క్లోరోఫి రిపోస్ లేదా క్రోపినోఫాస్ 400 గ్రాములు పిచికారీ చేసి నివారించుకోవాలన్నారు. కొన్ని పొలాల్లో రసం పీల్చే పురుగులైన తామర, పచ్చదోమ వాటి నివారణకు ఎఫిసెట్ పొడి 400 గ్రాములు ఆకు అడుగు భాగాన పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ, సిబ్బంది ధనరాజ్, రమేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలి

దొనకొండ: ఉపాధ్యాయులు క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం యూటీఎఫ్ దొనకొండ మండల శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం, స్వర్ణోత్సవ సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, మండల విద్యాధికారులు ఎస్.సాంబశివరావు, షేక్ అమీర్ బాషా హాజరయ్యారు. విద్యార్థులకు తరగతి గదిలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులకు నేడు ఆట విడుపు లభించిందని ఎంఈఓ ఎస్.సాంబశివరావు అన్నారు. ఉపాధ్యాయుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని, శారీరక దృఢత్వాన్ని పెంచడానికి ఈ ఆటలు బాగా ఉపయోగ పడతాయన్నారు. పాఠశాల స్థాయిలో ఆటల్లో గెలుపొందిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆటలు ఆడవచ్చని ఎంఈఓ-2 అమీర్‌బాషా తెలిపారు. అనంతరం ఆటల పోటీలను ఎంపీపీ ఉషామురళి ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు, యూటీఎఫ్ నాయకులు ఏ.ప్రభుదాసు, ఎం.వెంకటరెడ్డి, బి.అంజనాయక్, ఈ.రోశయ్య, సీనియర్ కామ్రేడ్ వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్ జి.సత్యనారాయణ, పి.కోటేశ్వరరావు, ఎస్.సాంబశివరావు, ఎం.రాజశేఖర్, ఆర్.ఏనోష్, కె.నరసింహారావు, కె.నాగరత్నం పాల్గొన్నారు.



ఆటల పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ ఉష

ఆర్థిక స్వావలంబన వైపు పయనించాలి

తాళ్లూరు (దర్శి): వృత్తి నైపుణ్య శిక్షణ ద్వారా ఆర్థిక స్వావలంబన వైపు మహిళలు పయనించాలని జన శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం అధికారి కె. శ్యామ్ సునీల్ సూచించారు. లక్కవరంలో నైపుణ్య అభివృద్ధి, ఔత్సాహిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో తాళ్లూరు మండలం లక్కవరం గ్రామ ఎస్సీ కాలనీలో మేకింగ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్యాం సునీల్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో మహిళలు తప్పని సరిగా ఏదో ఒక్క వృత్తి శిక్షణ నైపుణ్యం ద్వారా ఎంచుకున్న వృత్తిలో నైపుణ్యం ద్వారా మెళకువలు నేర్చుకుని తద్వారా స్వయం ఉపాధి పొందవచ్చని సూచించారు. దళిత బహుజన రిసోర్స్ రీజనల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి కోమలిలు మాట్లాడుతూ శిక్షణ సంస్థల ద్వారా శిక్షణ పొంది వాటిని సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. శిక్షకురాలు టి.నాగలక్ష్మి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్యామ్‌సునీల్

మిరపలో వేరు పురుగు నివారణ చేపట్టాలి

తాళ్లూరు (దర్శి): మిరపలో వేరుపురుగు నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు సూచించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా మండలంలోని కొర్రపాటివారిపాలెంలో మిరప పంట వేస్తున్న రైతులకు పలు సూచనలు సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఇటీవల మిరప పంట రైతులు ఎక్కువగా నాటుతున్నారన్నారు. వేరుపురుగులు వేళ్లు, కాండాలు తిని నష్ట పరుస్తాయని చెప్పారు. దీంతో నాటిన తర్వాత మొక్కలు వడలి ఎండి పోతాయన్నారు. నివారణకు బాగా కలిపిన మాగిన పశువుల ఎరువును ఉపయోగించాలన్నారు. దానితో పాటు ఎకరాకు రెండు క్వింటాళ్ల వేప పిండి వేయాలని చెప్పారు. కార్బోఫ్యూరాన్ మూడు శాతం గుళికలను ఎకరాకు నాలుగు కిలోలు ఎద పెట్టవచ్చని తెలిపారు. క్లోరి ఫైరిఫాస్ 20ఈసీ 5మిలీ లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ల దగ్గర పోయాలని తెలియజేశారు.



మిరపనారును పరిశీలిస్తున్న ప్రసాదరావు

జోరుగా గణేషుడి నిమజ్జనాలు



ఉమామహేశ్వరపురం ఊరేగింపులో సందడి చేస్తున్న బూచేపల్లి అభిమానులు



కోలాహలంగా వినాయక నిమజ్జనం

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని పెద ఉల్లగల్లు, పోలవరం, వేముల, ఉమామహేశ్వరపురం, పులిపాడు, బసవాపురం గ్రామాల్లో నాలుగో రోజు నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. ఉమామహేశ్వరపురంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బూచేపల్లి అభిమానులు, రెడ్డి యూత్ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువతీ యువకులు కోలాహలంగా గులాములు చల్లుకుంటూ ఉత్సాహంగా పాల్గొన్నారు. మండలంలోని పసుపుగల్లులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

బూచేపల్లి యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు

తాళ్లూరు (దర్శి): మండలంలోని విఠలాపురంలో బూచేపల్లి యూత్ ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం వేడుకలు సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, దివంగత మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి ఫొటోలతో వినాయకస్వామి నిమజ్జనం వేడుకలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. గులాములు చల్లుకుంటూ యువకులు తమ ఉత్సాహాన్ని కనబరిచారు.

దర్శి: మండలంలోని గణేశ్వరపాడులో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పూజా కార్యక్రమాల అనంతరం ట్రాక్టర్‌లో నిమజ్జనానికి తీసుకెళ్లారు. గులాములు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ వినాయకునిపై తమ అభిమానం చాటుకున్నారు.



నృత్యాలు చేస్తూ వినాయకుడిని తరలిస్తున్న భక్తులు

ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు సురక్షితం



గర్భిణులకు సూచనలిస్తున్న సీడీపీఓ భారతి

ముండ్లమూరు (దర్శి): గర్భిణులకు ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేయడం ద్వారా తల్లీబిడ్డ సురక్షితంగా ఉంటారని వైద్యాధికారి మధుశంకర్ అన్నారు. మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు విటమిన్లు పుష్కలంగా లభించే ఆకు కూరలు అధికంగా తీసుకోవాలన్నారు. నిత్యం పరీక్షలు నిర్వహించుకొని విటమిన్ లోపాలను గుర్తించి అందుకు తగినట్లు ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు చేశారు. సీడీపీఓ భారతి, సీహెచ్‌ఓ వెంకటరావు, హెచ్‌ఈ రాజు, సిబ్బంది అంజమ్మ పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.60 వేల ఆర్థిక సాయం

దొనకొండ: స్థానిక ఏబీఎం చర్చి ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు రూ.60 వేల ఆర్థిక సాయం చేశారు. మంగళవారం ఒంగోలులో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు వరద బాధితుల సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.60 వేల చెక్కును అందజేశారు. వారిలో పాస్టర్ డి.ప్రభుదాసు, ప్రెసిడెంట్ ఏ.చంద్రశేఖర్, సెక్రటరీ విల్సన్, ట్రెజరర్ ఎస్.సుధీర్, పెద్దలు ఎండీ సుధాకర్, మల్లెల ఆనంద్ ఉన్నారు.



కలెక్టర్‌కు చెక్ అందజేస్తున్న ఏబీఎం చర్చి ప్రతినిధులు

15వ తేదీలోపు ఈ-క్రాప్ పూర్తి చేయాలి

పెద్దారవీడు: ఈ-క్రాప్ నమోదును ఈ నెల 15వ తేదీలోపు త్వరతగతిన పూర్తి చేయాలని ఏఓ కె.బుజ్జిబాయి సూచించారు. మండలంలో దేవరాజుగట్టు, సానికవరం గ్రామాల్లో పంట నమోదు కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటను సాగు చేసిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పంట నమోదుతో రైతులకు ప్రభుత్వం ద్వారా ఎన్నో ఉపయోగాలు వర్తిస్తాయని అన్నారు. కార్యక్రమంతో రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

మార్కాపురం: మార్కాపురం పట్టణ శివారులో పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఐదుగురు జూదరును అదుపులోకి తీసుకుని, 4 బైకులు, 4 సెల్‌ఫోన్లు, 2500 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై సైదుబాబు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

పొలాల్లో కొండచిలువ కలకలం



కొండచిలువ పట్టుకుంటున్న రెస్క్యూ టీం



కొమరోలు : కొండచిలువను పట్టుకుని గోతంలో బంధించిన అటవీ సిబ్బంది

రాచర్ల: నువ్వు పంపట పొలాల్లో కొండచిలువ కలకలం సృష్టించింది. ఈ ఘటన మండలంలోని అనుమలవీడు గ్రామంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. అనుమలవీడు గ్రామానికి చెందిన ఇరుగుల వెంకటేశ్వర్‌రెడ్డి తన పొలంలో నువ్వు పంటను సాగు చేశాడు. మంగళవారం ఉదయం నువ్వు పంటను కోత చేస్తున్న సమయంలో 12 అడుగుల కొండచిలువ కనిపించడంతో కూలీలు భయాందోళన గురై పరుగెత్తుకుంటూ పక్క పొలాల్లో వచ్చారు. కొండచిలువను చూసిన కొంతమంది రైతులు గిద్దలూరు ఫారెస్టు అధికారులకు సమాచారాన్ని అందించడంతో ఇద్దరు ఫారెస్టు రెస్క్యూ, టీం సిబ్బంది వెంటనే అనుమలవీడు గ్రామానికి చేరుకొని పొలంలో ఉన్న 12 అడుగుల కొండచిలువను పట్టుకున్నారు. కొండచిలువను సోమిదేవిపల్లె గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెడుతున్నట్లు తెలిపారు.

కొమరోలు: మండలంలోని పోసుపల్లెలో మినరల్ వాటర్ ప్లాంటు వద్ద 15 అడుగుల కొండచిలువను మంగళవారం స్థానికులు గుర్తించారు. వెంటనే అటవీ శాఖ సిబ్బందికి సమాచారం అందించడంతో గుంతపల్లి, అల్లినగరం ఫారెస్టు బీట్ అధికారులు డి.లక్ష్మీనారాయణ, ఉమాదేవి సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. గిద్దలూరు స్నేక్ రెస్క్యూ టీమ్‌కు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని కొండచిలువను పట్టుకుని గోతంలో బంధించి రిజర్వు ఫారెస్టులో వదిలిపెట్టారు.

కుల నిర్మూలనతోనే దేశాభివృద్ధి



మాట్లాడుతున్న నల్లప్ప, పక్కన అంజయ్య, తదితరులు

మార్కాపురం: కుల నిర్మూలనతోనే దేశం అభివృద్ధి చెందుతుందని, బీజేపీ పాలనలో రాజ్యాంగం పెను ప్రమాదంలో పడిందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప పేర్కొన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా శిక్షణా తరగతులు మంగళవారం ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నల్లప్ప మాట్లాడుతూ.. పాలకులు కులాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకున్నారని అన్నారు. అంటరానితనానికి, అణచివేతకు, కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడే సంఘం కేవీపీఎస్ మాత్రమేనన్నారు. వర్గీకరణ అంశంపై అనుకూల, ప్రతికూల వాదనలు మాట్లాడేవారు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కేవీపీఎస్ జిల్లా వ్యవస్థాపకుడు జాలా అంజయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై రోజురోజుకూ అత్యాచారాలు, దాడులు పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని బలహీనపరిచి పూర్తిగా నీరుగారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయినప్పుడు కూడా పూడ్చేందుకు స్థలం లేక వివక్షను ఎదుర్కోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామ్, సీఐటీయూ నాయకులు సోమయ్య, డీకేఎం రఫీ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బాలనాగయ్య, జేసురత్నం, రాజశేఖర్, విక్టర్, నరేష్, కత్తి యేబు తదితరులు పాల్గొన్నారు.